www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

వాణిజ్య శాస్త్రము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY
For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్
Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 4 | సంచిక : 9 | 27-11-2023 | పుటలు : 4


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు




# మహిళ ఆరోగ్యమే సమాజ ఆరోగ్యం



మెడికల్ ఆఫీసర్ డా.ఎన్.సి.హేమ నళిని ని సన్మానిస్తున్న దృశ్యం

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యంగా ఉంటుందని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉమెన్ ఎంపవర్మెంట్ డెవలప్మెంట్ అండ్ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉమెన్ హెల్త్ అండ్ హైజీన్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు, రాజమహేంద్రవరం మెడికల్ ఆఫీసర్ డా.ఎన్.సి.హేమ నళిని హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గోదావరి జిల్లా ఉన్నత విద్యాకేంద్రమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎక్కువ మంది మహిళ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, విశ్వవిద్యాలయ విద్యార్థులు పట్టుదలతో సాధన చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకుంటామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కుటుంబాలను పోషిస్తున్నారని చెప్పారు. తల్లి ఆరోగ్యంగా ఉంటే సమాజం ఆరోగ్యంగా ఉంటుదని, మహిళ విద్యార్థులంతా ఆరోగ్యంపై దృష్టి సారించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తొడ్పాటు అందించాలని తెలిపారు. తరువాత రాజమహేంద్రవరం మెడికల్ ఆఫీసర్ డా.ఎన్.సి.హేమ నళిని మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు వంటి వివిధ కారణాల వలన నేటి కాలంలో ఎక్కువ మంది మహిళలు అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యాలపై దృష్టిని సారించాలని చెప్పారు. ఇటీవల కాలంలో మహిళలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, వాటి పరిష్కారాలను తెలియజేసారు. మహిళల వ్యక్తిగత ఆరోగ్య సమస్యలపై విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేసారు. ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ డా.పి.ఉమామహేశ్వరి మాట్లాడుతూ వినయ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు 2 నెలల టైలరింగ్ సర్టిఫికెట్ కోర్సును ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ మహిళ సిబ్బంది, మహిళ విద్యార్థులు ఈ ప్రోగ్రామ్ కు అర్హులన్నారు. అనంతరం డా.ఎన్.సి.హేమ నళిని ని వీసీ ఆచార్య కె.పద్మరాజు సన్మానించి జ్ఞాపికతో అభిందించారు. ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో వీసీ పద్మరాజును సన్మానించి అభిందించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్ వర్మ, ప్రిన్సిపాల్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి, డా.పి.విజయనిర్మల, డా.వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ డా.సుంకర వెంకటేశ్వరరావు, విశ్వవిద్యాలయ అధికారులు అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజును సన్మానిస్తున్న వీసీ కె.పద్మరాజు

# నన్నయను సందర్శించిన సెంచూరియన్ వర్సిటీ ఛాన్సలర్

ఆదికవి నన్నయ యూనివర్సిటీని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు సందర్శించారు. నన్నయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ కె.పద్మరాజు తన గురువు ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు కు స్వాగతం పలికారు. వీసీ కార్యాలయంలో జి.ఎస్.ఎన్.రాజు ను వీసీ పద్మరాజు శాలువాతో సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ తన గురువు సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు కలవడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. జి.ఎస్.ఎన్.రాజు విద్యతో పాటు క్రీడల్లోను అగ్రస్థానంలో ఉంటూ తన వంటి విద్యార్థులకు చక్కని మార్గదర్శనం చేసారని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఫస్ట్ ర్యాంక్ తో బీఈ, ఎంఈ ఫస్ట్ క్లాస్ డిస్టింక్షన్ సాధించారని, అన్ని శాఖలు 1వ సంవత్సరం బీఈ 10/10 సిజిపిఎ తో అగ్రస్థానంలో ఉన్నారని, నేటికి అన్ బ్రాకెన్ రికార్డ్ గా ఉన్నారని కొనియాడారు. వెయిట్ లిఫ్టింగ్ లో ఆంధ్రా యూనివర్సిటీ తరుపున ప్రాతినిధ్యం వహించారని, పరుగుపందెంలో ఆంధ్రా యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ గా, బాక్సర్ గా, షాట్ పుచ్ లో గోల్డ్ మెడలిస్ట్ గా క్రీడల్లోను తనదైన ముద్రవేసుకున్నారని గుర్తుచేసారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరు కావాలని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు కోరారు. దీనిపై స్పందించిన ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ తనకు ఎంతో ఇష్టమైన విద్యార్థి కె.పద్మరాజు ఎంతో పట్టుదలతో విద్యావేత్తగా ఎదిగి వివిధ ఉన్నత పదవులను అధిరోహించి నేడు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతిగా సేవలందించడం హర్షణీయమన్నారు. విద్యార్థుల ఉన్నతిని గురువులు నిత్యం ఆకాంక్షిస్తారని, ఆనందిస్తారని అన్నారు. సౌత్, వెస్ట్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు హాజరవుతానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



## ధర్మచక్రం

'మానవాళికి వెలుగుబాటగా నిలిచిన మహాపురుషుల చరిత్రే ప్రపంచ చరిత్ర' అన్నారొక మహనీయుడు.బహుశా మన దేశానికి ఈమాట బాగా అన్వయిస్తుందేమో. అద్భుతమైన మేధాసంపత్తికి, జ్ఞాన సంపదకు నిలయమైన ఉద్దండులైన గురువులకు, తత్త్వవేత్తలకు, వారు సృజించిన సాహిత్యానికి మన దేశం ఆలవాలమైంది. అటువంటి చరిత్రకు ప్రతి భారతీయుడు వారసుడే. వేల సంవత్సరాల చరిత్ర భారతీయ సమాజాన్ని సుసంపన్నం చేస్తూనే ఉంది.

సత్యాన్ని సాధించేవరకూ చలించ కూడదనే దృఢ నిశ్చయంతో సిద్ధార్థుడు బోధివృక్షం క్రింద పీఠం వేశాడు. ఆత్మవిశ్వాసంతో బుద్ధునిగా మారాడు. తాను పొందిన వికాసాన్ని అందరితో పంచుకోవాలనే నిర్ణయించుకున్నాడు. మహోన్నతమైన సర్వసంగ పరిత్యాగంతో సంతృప్తిని పొందినమీదట 'బహుజన హితాయ - బహుజన సుఖాయ' అందరి మేలు కోసం, అందరి ఆనందం కోసం ఉపదేశాల్ని ప్రసాదించాడు.ఆ ఉపదేశాలు ప్రజల్ని నైతికంగా, ఆధ్యాత్మికంగా చైతన్యపూరితం చేయగలిగాయి. ఆ ప్రేరణతో అశోకుడు యుద్ధోన్మాదాన్ని, తన రాజ్యంలో హింసాయుత మార్గాలని విడనాడటం చరిత్రలో ఉదాత్తంగా మిగిలిన గొప్ప ఘట్టం. గౌతమ బుద్ధుని ఆసియా ఖండపు అఖండజ్యోతిగా ప్రతిష్టించటంలో అశోకుడు మూలకారకుడయ్యాడు.

బుద్ధుడు ఒక మహత్తరమైన వేదాంతి. అత్యున్నత స్థాయికి చెందిన తత్త్వాన్ని ప్రబోధిస్తూ,అత్యల్పస్థాయి జంతువులపట్ల కూడా అపారమైన సానుభూతిని కలిగి ఉన్నాడు. ఆదర్శప్రాయమైన కర్మయోగి.'మంచి చేయండి,మంచిగా మసలుకోండి.ఇదే మీ విముక్తికి కానీ, మీరే సత్యానికి కానీ సరైన గమ్యం' అని ప్రబోధించి

కర్మయోగం అనే ఉదాత్త విధానానికి ప్రతినిధిగా నిలిచాడు. ఆయన చిన్ముద్ర మనసా వాచా కర్మణా సరైన వ్యక్తిత్వాన్ని సాధించటం ద్వారా సత్ప్రవర్తనను ఉగ్గడిస్తోంది.

బాల్యం, కౌమారం, యవ్వనం, వార్ధక్యం వరుసగా ఇవి పరిపక్వ దశలు. ప్రతి మనిషికి సంబంధించిన నాలుగు మహా సత్యాలివి.వీటికి అష్టాంగమార్గం ద్వారా ఆత్మావలోకనంతో జ్ఞానోదయం కలిగి శాంతిని పొందే విధానాన్ని ప్రబోధించాడు బుద్ధుడు.

మనిషికి - దైవానికి, ప్రకృతికి - శాస్త్ర పరిజ్ఞానానికి గల పరస్పరాధారమైన ఒక చక్రం చైతన్యంతో పరిభ్రమించటం ద్వారానే సృష్టి ఎలా మొదలైందనే విషయాన్ని ధార్మిక గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ నిరంతర చక్రపరిభ్రమణం మీదనే మనిషి సుఖశాంతులు, శ్రేయస్సు కూడా ఆధారపడి ఉన్నాయి. చక్రం అనేది చైతన్యానికి ప్రతీక. బుద్ధుని భౌతికవాదం ధర్మచక్రానికి మరింత చైతన్యాన్ని కలిగించింది. ఆ చక్రమే బౌద్ధ చిత్రకళలో చైతన్యచిహ్నంగా వ్యాప్తి చెందింది.ఆ ధర్మచక్రమే మన భారత రిపబ్లిక్ జాతీయ చిహ్నంపై చోటు చేసుకొని వెలుగొందుతోంది. విశ్వజనీనమైన భారతీయ ధార్మిక జీవనతత్త్వమే నిరంతరం మహోజ్జ్వలంగా మనం వెలుగొందటానికి కారణమవుతోంది.

'సమస్త వస్తుజాలం నశించేదని,మనల్ని మనం పరిపూర్ణంగా తీర్చిదిద్దుకోవటానికే నిశితంగా పాటుపడాలని' పదేపదే ఆయన నిర్వాణానికి ముందు తెలియజేశారు. మనిషి ఆధ్యాత్మిక అన్వేషణకు,జాతీయ సాంస్కృతిక జీవనానికి బుద్ధుని సందేశం గొప్ప మార్గదర్శకం కాగలిగింది. భారతీయ వేదాంతుల బోధనలు నిరంతరం మనకు శిరోధార్యమని, ఆచరణ మార్గాలనే విషయాన్ని మాత్రం మర్చిపోకూడదు.



## నేషనల్ రోప్ స్కిప్పింగ్‌కి ఎంపికైన నన్నయ విద్యార్థి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లి గూడెం ప్రాంగణం ఫార్మసీ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థిని వి. న్యూ రోసీ భీమవరం డిఎన్ఆర్ కళాశాలలో నిర్వహించిన రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రెండు గ్రూపులు, సింగిల్ లెవల్స్లో నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు హాజరయ్యారు. న్యూ రోసీ సాధించిన విజయానికి క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.అశోక్, మరియు డిపార్ట్మెంట్ కోర్స్ కోఆర్డినేటర్ శ్రీమతి లిఖిత అభినందనలు తెలిపారు.



**నవంబర్ 27.. గురునానక్ జయంతి**

అహంకారం, గర్వం,
పొగరుబోతు తనం...
చాలా ఖరీదైనవి.
అవి కొనుక్కునే స్తోమత మనకులేదు.
అందుకే.. చవగ్గా దొరికే సంతోషం,ప్రేమ,చిరునవ్వు,
సంతృప్తి,సర్దుబాటు అనేవాటితో సరిపెట్టుకుందాం!!

## తాతపూడి అశోక్‌కు పిహెచ్.డి. ప్రదానం



టి.అశోక్ కు పిహెచ్.డి ప్రదానం చేస్తున్న వీసీ ఆచార్య కె. పద్మరాజు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న తాతపూడి అశోక్ కు నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు పిహెచ్.డి ప్రదానం చేసారు. మంగళవారం యూనివర్సిటీలో వీసీ ఆచార్య కె.పద్మరాజు తాతపూడి అశోక్ కు పిహెచ్.డి అవార్డును అందజేసి శుభాకాంక్షలను తెలియజేసారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ మెషిన్ లెర్నింగ్ టెక్నిక్ లతో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ని ఉపయోగించి పర్యావరణ కారకాలు మరియు నేల పోషకాల ఆధారంగా తగిన పంటను అంచనా వేయడం అనే అంశంపై అశోక్ పరిశోధన చేసారని చెప్పారు. ఆచార్య పి.సురేష్ వర్మ మార్గదర్శకత్వంలో పరిశోధనను పూర్తి చేసారని తెలిపారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాలైన గోదావరి జిల్లాలో ఇటువంటి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరిశోధనలు ఎంతో ఉపయోగపడతాయని వారిని అభినందించారు. పిహెచ్.డి అందుకున్న అశోక్ కు రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డా.పి.వెంకటేశ్వరరావు, విభాగాధ్యాపకులు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, రిసెర్చ్ డెవలప్మెంట్ సెల్ డీన్ డా.కె.రమణేశ్వరి, స్టూడెంట్ అఫైర్స్ డీన్ డా.ఎన్.ఉదయభాస్కర్, డా.పి.ఉమమహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## భారత రాజ్యాంగ దినోత్సవం



డా.బి.ఆర్ అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు, అనంతరం డా.బి.ఆర్. అంబేద్కర్ కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ ప్రతివద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భారత రాజ్యాంగం పీఠికను విశ్వవిద్యాలయ అధ్యాపకులు మరియు విద్యార్థులచే చదివింప చేసారు. ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఔన్నత్యాన్ని, రాజ్యాంగ రచనకు కృషి చేసిన రాజ్యాంగ రూపకర్తలను కొనియాడారు. భారత రాజ్యాంగ స్ఫూర్తిని ముందుకు తీసుకువెల్లడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని తెలియజేసారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా గ్రంథాలయ సమన్వయ కర్త డా.విజయ నిర్మల మాట్లాడుతూ భారత రాజ్యాంగం గొప్పతనాన్ని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సహాయగ్రంథాలయాధికారి డా.టి.సింహాచలం మరియు సిబ్బంది సతీష్, మణికంఠ, సిబ్బంది మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ సైకాలజీ సెమినార్‌ను విజయవంతం చేయండి


అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నవంబర్ 29,30 తేదీలలో ఎస్.సి.ఆర్.ఎ (సొసైటి ఫర్ కమ్యూనిటి రిసెర్చ్ ఇన్ ఎక్షన్) -యు.ఎస్.ఎ. ఆధ్వర్యంలో స్పృహ సైకాలజీ అలూమ్నీ అసోసియేషన్, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ సైకాలజీ, జి.ఎస్.ఎల్ మెడికల్ కాలేజీ సంయుక్త సహకారంతో అంతర్జాతీయ సెమినార్ ను నిర్వహిస్తున్నారని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శనివారం యూనివర్సిటీలో దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ "గ్లోబల్ పీస్ అండ్ హెల్త్ మ్యాగ్జిమైజేషన్ - ఎ కమ్యూనిటీ పెరస్పెక్టివ్" అనే అంశంపై అంతర్జాతీయ సదస్సు ను నిర్వహిస్తున్నారని తెలిపారు. విశ్వశాంతికి వ్యక్తిగత, సామాజిక, ఆరోగ్యకర జీవన విధానానికి కమ్యూనిటీ సైకాలజీ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విద్యావేత్తలు, ప్రముఖులు, ఎన్జీఓలు పూర్తి సహాయ సహకారాలను అందించి అంతర్జాతీయ సెమినార్ ను విజయవంతం చేయాలని వీసీ సూచించారు. తరువాత స్పృహ అలూమ్నీ వైస్ ప్రెసిడెంట్ చండి ప్రియ వీసీ ఆచార్య కె.పద్మరాజుకు దివ్య ద్వాదశిక బృహత్ భారతీయ పుష్కరోత్సవాలు పుస్తకాన్ని అందజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ సామాజిక దృక్పథంతో ప్రపంచ శాంతి మరియు ఆరోగ్యాన్ని పెంపొందించడంపై జరుగుతున్న అంతర్జాతీయ సదస్సును జయప్రదంచేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, సైకాలజీ విభాగాధ్యాపకులు డా.పి.రాజశేఖర్, డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, డా.సిహెచ్.భవాని, స్పృహ అలుమ్నీ అసోసియేషన్ సభ్యులు సుంకర నాగేంద్రకిశోర్, చండిప్రియ, జి.వర్మ పాల్గొన్నారు.


గ్లోబల్ సర్టిఫైడ్ మాస్టర్ ట్రైనర్స్ తో విశ్వవిద్యాలయ అధికారులు

# గురువులు నిత్యవిద్యార్థులుగా అప్ గ్రేడ్ అవ్వాలి

అధ్యాపకులంతా నిత్య విద్యార్థులుగా అప్ గ్రేడ్ అవ్వాలని, నూతన విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ విద్యారు?లకు అందించాలని వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెమినార్ హాల్ లో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫ్యాకల్టీ ఓరియెంటేషన్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సమాజ అభివృద్ధిలో గురువు బాధ్యత ఎంతో కీలకమైనదని అన్నారు. అందరికీ నాణ్యమైన, నైపుణ్యమైన విద్యను అందిచాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమాలు అధ్యాపకులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు వాధ్వాని ఫౌండేషన్ యొక్క సహకారంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ మరియు ఆదికవి నన్నయ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఫ్యాకల్టీ ఓరియెంటేషన్ ప్రోగ్రాం విజయవంతం అయిందని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి రిజిస్ట్రేషన్ చేయించుకున్న 32 మంది ఇంగ్లీషు ఫ్యాకల్టీ కి ఈ ప్రోగ్రామ్ ను నిర్వహించారని చెప్పారు. మూడు రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, మాస్టర్ ట్రైనర్ పి.స్వాతి లను వీసీ అభినందించారు. ఓరియంటేషన్ ప్రోగ్రాం కు హాజరైన అధ్యాపకులంతా మాస్టర్ ట్రైనర్స్ గా ఎదిగి గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు మార్గదర్శకం సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా అధ్యాపకులలో విజ్ఞానం, నైపుణ్యాలు పెంపొందించేందుకు అవకాశాలుంటాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తులుగా ఎదగడానికి, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ ప్రోగ్రాం ఎంతో ఉపయోగపడిందని అధ్యాపకులు తమ అభిప్రాయాలను తెలియజేసారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారికి ఇటువంటి ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్ ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. నైపుణ్యం యొక్క లక్ష్యాలను చేరుకోవడానికి నిర్మాణాత్మక సెషన్‌లలో ఉపయోగించే కంటెంట్ లను ప్రోగ్రామ్ ద్వారా తెలుసుకున్నామని చెప్పారు. ఐడియల్ క్లాస్ రూమ్ సెటింగ్ లో ఎక్స్పీరియన్స్ లెర్నింగ్, ఫ్లిప్ క్లాస్ రూమ్ వంటి పద్దతుల ద్వారా అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఈ ప్రోగ్రాంలో ప్రతిభ కనపరచిన అధ్యాపకులకు గ్లోబల్ సర్టిఫికేషన్ ఇన్ ఎంప్లాయిబులిటీ సర్టిఫికేట్టులను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ సెల్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, మాస్టర్ ట్రైనర్ పి.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషన్ తో ఎంవోయుపై చర్చ



ఏ.పి.పి.ఎస్.సి గ్రూప్-I, గ్రూప్-IIతో సహా రాబోయే వివిధ పోటీ పరీక్షల కోసం అండర్ గ్రాడ్యుయేట్ & పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు 21స్ట్ సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించడానికి పలు విషయాలను చర్చించారు. ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్ డా.బి.జగన్ మోహన్ రెడ్డి, డా.టి. హైమవతి 21 స్ట్ సెంచరీ సంస్థల కరస్పాండెంట్ మరియు CEO కె. ధరణి, సీనియర్ సివిల్స్ మెంటార్ బి.అభినవ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

21వ శతాబ్దపు ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రత్యేకంగా రూపొందించిన కోచింగ్ ప్రోగ్రామ్‌ను యూనివర్సిటీ ప్రాంగణంలో వివిధ పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరచడానికి ఎంపిక చేసిన విద్యార్థులను ప్రోత్సహించడానికి మరియు వారికి మార్గదర్శకత్వం ఇవ్వడానికి నిర్వహించబడుతుందని చర్చించారు. రెండుదశల ప్రక్రియ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.మరిన్ని వివరాలు త్వరలో ప్రకటిస్తారు.

# కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలి

## - సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ రాజు
## - గైట్ అటానమస్ కళాశాలలో వేద-2023 సదస్సు



యువ ఇంజనీర్లు కమ్యూనికేషన్ స్కిల్స్ ను మరింత పెంపొందించుకోవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం చాన్సలర్ జీఎస్ఎన్ రాజు సూచించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పరిధిలోని గైట్ అటానమస్ కళాశాలలో బెంగుళూరులోని వేద సొసైటీ సహకారంతో వాక్యూమ్ ఎలక్ట్రానిక్ పరికరాలు, అప్లికేషన్లలో అభివృద్ధి చెందుతున్న ధోరణులు అనే అంశంపై జరుగుతున్న వేద-2023 సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో ఎంత పరిజ్ఞానం ఉన్నప్పటికీ కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా ముఖ్యమన్నారు. మరో ప్రత్యేక అతిథి జేఎన్టీయూకే వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ వేద సదస్సు విజ్ఞాన సముపార్జనకు దోహదపడుతుం దన్నారు. నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ పరిశ్రమలు ఎదురుచూస్తున్న విధంగా నిపుణులను అందించేందుకు వేద వంటి సదస్సులు ఉపయోపడతాయన్నారు. సదస్సులో భాగంగా తొలుత వేద సావనీరు విడుదల చేశారు. కార్యక్రమంలో గైట్ ఎండీ శశికిరణ్ వర్మ, ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టరు ఎం.శ్రీనివాసరావు, పరిశోధనా భివృద్ధి డైరెక్టర్, కాన్ఫరెన్స్ చైర్ ఆర్ఎస్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.లీలావతి, ఎస్ఈఎస్ఎన్ మూర్తి, వేద కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు, కోకన్వీనర్ శ్రీజమధు పాల్గొన్నారు.






# జి.ఎస్.ఎల్ తో నన్నయ ఎంవోయూ


ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న జి.ఎస్.ఎల్, నన్నయ అధికారులు

జి.ఎస్.ఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. గురువారం యూనివర్సిటీలో జరిగిన ఎంవోయూ కార్యక్రమంలో వీసీ ఆచార్య కె.పద్మరాజు సమక్షంలో జి.ఎస్.ఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ గన్ని భాస్కరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేసి పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మరియు జి.ఎస్.ఎల్ వివిధ అంశాలపై పరస్పర ప్రయోజనలతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ సహకారంతో జి.ఎస్.ఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీ లో ఆసక్తిగల విద్యార్థులకు, సిబ్బందికి యోగా డిప్లమా, యోగా పీజీ డిప్లమా కోర్సులను అందిస్తున్నామన్నారు. అలాగే జి.ఎస్.ఎల్ సహకారంతో విశ్వవిద్యాలయ విద్యార్థులకు, సిబ్బందికి ఫార్మసీ మినహా వర్తించే అన్ని ఛార్జీలపై 25 శాతం తగ్గింపు ఇస్తారని, ఉచిత అంబులెన్స్ సర్వీసుల ను అందిస్తారని చెప్పారు. ఎం.పి.ఈడి కోసం ఫిజియోథెపీ ల్యాబ్ శిక్షణ ఇస్తారని తెలియజేసారు. జి.ఎస్.ఎల్ చైర్మన్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ తన తల్లి గన్ని సుబ్బలక్ష్మీ పేరుతో ప్రారంభించిన జి.ఎస్.ఎల్ మెడికల్ కాలేజ్ 20 సంవత్సరాలుగా విజయవంతంగా నడుపబడుతుందన్నారు. యోగా డిప్లమా, యోగా పీజీ డిప్లమా కోర్సులు విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయ సిబ్బంది, విద్యార్థులకు జి.ఎస్.ఎల్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని వాటని సద్వినియోగం చేసుకోవచ్చునని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఈ ఎంవోయూ ద్వారా రెండు సంస్థల్లోని విద్యార్థులకు, సిబ్బందికి విద్య వైద్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, జి.ఎస్.ఎల్ కలిసి మరిన్ని సేవలు అందించేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం విశ్వవిద్యాలయం తరుపున గన్ని భాస్కరరావును సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు ప్రిన్సిపాల్ ఆచార్య డి.జ్యోతిర్మయి, జి.ఎస్.ఎల్ డైరెక్టర్ వి.హరీష్, ప్రిన్సిపాల్ డా.పి.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.పి.చతుర్వేది, యోగా టీచర్ పి.ఆశ, విశ్వవిద్యాలయ అధికారులు పాల్గొన్నారు.





కార్తీక పున్నమి వేళలోన....

కలికి వెన్నెల కెరటాలపైన.....!

కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

చిత్రం: హంపి రాజమహేంద్రవరం.

# పౌరులకు పట్టం - మన భారత రాజ్యాంగం

సుదీర్ఘకాలం పరాయి పాలనలో ఉన్న మన దేశం ఎందరో స్వాతంత్ర యోధుల త్యాగఫలంతో 1947 ఆగస్టు 15న స్వాతంత్రం సంపాదించుకుంది. అయితే అప్పుడే మన దేశానికి రాజ్యాంగం అవసరమైంది. రాజ్యాంగం అంటే దేశానికి, ప్రజలకు,ప్రభుత్వానికి కరదీపికగా ఉండాలి. అందుకే రాజ్యాంగానికి ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది.మన దేశం కంటే ముందు అనేక దేశాలు రాజ్యాంగాలను సొంతంగా రచించుకున్నాయి. అయితే భారతదేశానికి రాజ్యాంగ రచన అంటే చాలా సంక్లిష్టమైన పని. ఎందుకంటే మన దేశంలో అనేక మతాలు,కులాలు,తెగలు, అణగారిన వర్గానికి చెందిన ప్రజలు, దళితులు ఎందరో ఉన్నారు.వారందరి ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగం రచన చేయడం అంటే ఆషామాషీ కాదు. కానీ ఈ సవాల్ ను స్వీకరించారు మన అంబేద్కర్ గారు.అనేక దేశాలు తిరిగి ఎన్నో దేశాల రాజ్యాంగాలను పరిశీలించి భిన్నత్వంలో ఏకత్వం గా ఉన్న మన దేశానికి అందరికీ ఆమోగ్యయోగ్యమైన రాజ్యాంగాన్ని రచించారు.

ఈ రాజ్యాంగ రచన చేయడానికి అంబేద్కర్ చైర్మన్ గా ఉన్న రాజ్యాంగ ముసాయిదా కమిటీని ఏర్పరిచారు.అందులో గోవింద్ వల్లభ పంత్, %ఖ.వీ% మున్షి,%గా%.కృష్ణమాచారి, %చీ%.గోపాలస్వామి,బి.ఎల్ మిట్టల్,ఎం.డి సాదుల్లా,%ు.ు%కృష్ణమాచారి మొదలైన వారు సభ్యులుగా ఉన్నారు.వీరందరూ కష్టపడి 2 సం. 11 నెలల 18 రోజుల పాటు ఎన్నో వ్యాయాప్రాయాసాలకు ఓర్చి 1949 నవంబర్ 24న బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్ పటేల్ ఈ రాజ్యాంగాన్ని ప్రతిపాదించారు.


కొత్తగా స్వాతంత్రం సంపాదించుకున్న మన దేశానికి భారత రాజ్యాంగం ఒక కొత్త ఉత్సాహాన్ని పెంపొందించింది. భారత ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించింది. ఆకలి,నిరక్షరాస్యత, వెనుకబాటుతనం వంటి వాటిని నిర్మూలించి సమగ్ర అభివృద్ధి సాధించడానికి ముఖ్య కారణం రాజ్యాంగ నిర్మాణమే.ఒక్క మాటలో చెప్పాలంటే దేశ ప్రజలకు నాణ్యమైన జీవితాన్ని మరియు మన దేశం సమగ్ర అభివృద్ధి సాధించడాన్ని రాజ్యాంగం సులభతరం చేసింది.




రాజ్యాంగం అంటే కేవలం ప్రకరణలు,అధికారులు, నిబంధనలు మాత్రమే కాదు. "భారత రాజ్యాంగం ఒక సజీవ పత్రం".దీనిలో భారతజాతి యొక్క ప్రాథమిక విలువలు, హక్కులు,నాగరికత మొదలైనవి మిళితమై ఉన్నాయి.అదే సమయంలో ప్రజాభిప్రాయ డిమాండ్లకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్చుకోగల సరళమైన నిర్మాణంగా కూడా రాజ్యాంగం ఉంది.అందుకే భారత రాజ్యాంగం ప్రజల రాజ్యాంగం అయింది. అటువంటి రాజ్యాంగం గురించి అందరూ తెలుసు కోవాలనే ఉద్దేశంతో 2017 నవంబర్ 26 నుండి "రాజ్యాంగ దినోత్సవం"గా జరుపుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది .ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో రాజ్యాంగం గురించి,రాజ్యాంగం గొప్పతనం గురించి అందరికీ తెలిసే విధంగా కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తుంది. అంటరానితనం,అగ్ర,పేద కులాలకు సమానమైన రిజర్వేషన్లు, అణగారిన వర్గాలకు,దళితులకు ప్రత్యేకమైన హక్కులు, అందరికీ సమానంగా విద్యా,ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఇటువంటివి ఎన్నో 70 ఏళ్ల క్రితమే ముందే ఊహించి ఇప్పటి ప్రజలకు అనుగుణంగా రాజ్యాంగం రచన గావించిన అంబేద్కర్ కు మనం ఎంతైనా సెల్యూట్ చేయాల్సిందే. రాజ్యాంగంలోని పీఠిక, ప్రాథమిక హక్కులు,ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక విధులు ప్రజలకు కవచాలుగా మారాయి. సంపద ఏ ఒక్కరి చేతుల్లో కేంద్రీకృతం కాకుండా అందరికీ అందేటట్లు చూసింది.మద్యపాన నిషేధం,వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడం,ప్రజల హక్కులకు రక్షణ కల్పించడం ఇటువంటివి ఎన్నో ప్రజలను దృష్టిలో పెట్టుకొని రాసినవే.అందుకే భారత రాజ్యాంగాన్ని ప్రజలందరూ గౌరవించాలి. ఎందుకంటే మన రాజ్యాంగం చాలా గొప్పది.

**- బి.సుశాంత్ కుమార్,**
**ఎమ్మెస్సీ,ఎం.ఎడ్,**

# నవంబర్ 26 - భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం




రాజ్యాంగం దేశానికి ప్రాథమిక గ్రంథం.ప్రతి దేశానికి ఒక రాజ్యాంగం ఉంటుంది.రాజ్యాంగం దేశ స్వరూప, స్వభావాలను, ప్రభుత్వ పాలనా విధానాన్ని, అధికారాలను నిర్ణయిస్తుంది.దేశ ప్రజల ఆశలను, ఆశయాలను నెరవేర్చేదిగా ఉంటుంది. అంతేకాక ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఉండే సంబంధాన్ని తెలియజేస్తుంది. భారత రాజ్యాంగం ప్రపంచ దేశాల రాజ్యాంగాల కంటే అతి పెద్దది మరియు విశాల దృక్పథంతో రూపొందించబడింది. మన దేశ రాజ్యాంగాన్ని "రాజ్యాంగ పరిషత్" రూపొందించింది. రాజ్యాంగ పరిషత్ నే "రాజ్యాంగ సభ, రాజ్యాంగ నిర్మాణ సభ" అని కూడా అంటారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు మన దేశ పాలనకు అవసరమైన రాజ్యాంగ చట్టాలను బ్రిటిష్ ప్రభుత్వం రూపొందించి, అమలు జరిపేది. బ్రిటిష్ వారు రూపొందించిన చట్టాల్లో భారతీయుల ప్రమేయం ఏమాత్రం లేదు. ఈ చట్టాలు భారత ప్రజల ఆశయాలను నెరవేర్చలేకపోయాయి. అయితే 1927 లో భారతీయులకు రాజ్యాంగాన్ని రూపొందించుకొనే అవకాశం ఒక సవాలు రూపంలో దొరికింది. 1927 లో సైమన్ కమీషన్ కు వ్యతిరేకంగా వస్తున్న ఆందోళనల నేపథ్యంలో అప్పటి భారత వ్యవహారాల మంత్రిగా ఉన్న లార్డ్ బర్కిన్ హెడ్ "భారతీయులు అన్ని రాజీయపార్టీలకు ఆమోదయోగ్యంగా ఉండే రాజ్యాంగాన్ని రూపొందిస్తే, బ్రిటీష్ ప్రభుత్వం దానిని పరిశీలిస్తుందని" ప్రకటన ద్వారా సవాలు చేసాడు. లార్డ్ బిర్కిన్ హెడ్ సవాలును భారతీయ నాయకులు స్వీకరించారు. 1928 లో డాక్టర్ ఇబ్రహీం అన్సారీ అధ్యక్షతన బొంబాయిలో రాజ్యాంగ నివేదికను రూపొందించేందుకు అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాజ్యాంగాన్ని రూపొందించేందుకు మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన 9 మంది సభ్యులతో ఒక కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ తయారు చేసిన నివేదికను "నెహ్రూ నివేదిక" అంటారు. ఈ నివేదికను లక్నో సమావేశంలో కాంగ్రెస్ ఆమోదించింది. కానీ ఈ నివేదిక అన్ని పార్టీల ఆమోదాన్ని పొందలేకపోయింది. ముఖ్యంగా ముస్లిం లీగ్ ఈ నివేదికను తీవ్రంగా వ్యతిరేకించింది.1930-32 మధ్య జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ భారతదేశానికి రాజ్యాంగం కావాలని డిమాండ్ చేసింది. దానితో తర్వాత కాలంలో జరిగిన పైజాపూర్ తీర్మానం (1935), జవహర్ లాల్ నెహ్రూ ప్రతిపాదన (1938), ఆగష్టు ప్రతిపాదన (1940), క్రిప్స్ ప్రతిపాదనలు (1942), కేబినెట్ మిషన్ ప్రతిపాదనలు (1946) మొదలైన వాటిలో జరిగిన చర్చల ద్వారా భారత రాజ్యాంగాన్ని రూపొందించుటకు "రాజ్యాంగ పరిషత్" అవసరం అని, ఆ పరిషత్ ను ఓటు హక్కు ద్వారా ఎన్నుకోబడిన సభ్యులతో ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. దానితో 1946 జూన్, జూలై నెలల మధ్య కాలంలో ఎన్నిక ద్వారా ఎన్నుకోబడిన సభ్యులతో "భారత రాజ్యాంగం పరిషత్" భారత రాజ్యాంగాన్ని రూపొందించుటకు ఏర్పడింది. రాజ్యాంగ పరిషత్ నిర్ణయం ప్రకారం ప్రతి పది లక్షల ఓటర్లకు ఒక సభ్యుని చొప్పున మొత్తం 389 మంది ప్రతినిధులు ఈ పరిషత్ లో ఉండాలి. వీరిలో 93 మంది స్వదేశీ సంస్థానాల నుండి నియమించబడ్డారు. 78 స్థానాలను ముస్లింలకు కేటాయించారు. మిగిలిన 218 స్థానాల్లో కాంగ్రెస్ తో పాటు వివిధ పార్టీలకు చెందిన అనేక మతాల,కులాల వారు ఎన్నికల్లో పాల్గొన్నారు.218 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ నుండి 208 మందిబీ ముస్లింలకు కేటాయించబడిన 78 స్థానాల్లో, 73 స్థానాల్లో ముస్లింలు గెలుపొందారు. అయితే మహమ్మద్ ఆలీ జిన్నా నాయకత్వంలో ముస్లిం లీగ్ రాజ్యంగ పరిషత్ ను బహిష్కరించింది. తప్పనిసరి పరస్థితుల్లో దేశ విభజన జరిగి భారత్, పాకిస్థాన్ అనే రెండు స్వతంత్ర రాజ్యాలుగా భారతదేశం విడిపోయింది.దానితో ముస్లింలకు కేటాయించబడిన 78 స్థానాలు, రెండు స్వదేశీ సంస్థానాలు పాకిస్థాన్ లోకి వెళ్లిపోయాయి. భారత్ నుంచి పాకిస్థాన్ విడిపోయిన అనంతరం ఎన్నిక ద్వారా ఎన్నుకోబడిన(208) మరియు భారతదేశంలోని స్వదేశీ సంస్థానాల నుంచి నియమించబడిన(91) వారితో కలిసి రాజ్యాంగ పరిషత్ మొత్తం 299 సభ్యులతో ఏర్పడింది.

రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం 1946 డిసెంబర్ 9న ప్రారంభమైంది. 299 మంది సభ్యులకు గాను 111 మంది ఈ సమావేశానికి హాజరయ్యారు. డాక్టర్ సచ్చిదానంద సిన్హా రాజ్యాంగ పరిషత్ కు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అయితే డిసెంబర్ 11 న సచ్చిదానంద సిన్హా మరణించడంతో డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ పరిషత్ కు అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మొదటి సమావేశంలో పండిట్ జవహర్ లాల్ నెహ్రూ రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మరియు రాజ్యాంగాన్ని ఉన్నతంగా రూపొందించాలనే ఉద్దేశంతో రాజ్యాంగ పరిషత్ కమిటీ పద్ధతిని అనుసరించింది. ఈ కమిటీలు రెండు రకాలుగా విభజంచబడ్డాయి. 1.విధాన నిర్ణయ కమిటీలు(10 కమిటీలు) 2.విషయ నిర్ణయ కమిటీలు(12 కమిటీలు). విషయ నిర్ణయ కమిటీల్లో "రాజ్యాంగ రచన కమిటీ" ప్రధానమైనది. ఈ కమిటీనే రాజ్యంగ ముసాయిదా సంఘం అని కూడా అంటారు. ఈ కమిటీ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో 1947 ఆగస్ట్ 29న ఏర్పడింది. భారత ప్రభుత్వానికి న్యాయ సలహాదారుడైన బి.ఎన్.రావ్ రాజ్యాంగ రచనా కమిటీకి సలహాదారుగా పనిచేసారు.ఈ కమిటీలోని సభ్యులందరూ ఉన్నత విద్యావంతులు.అంతేకాక, దేశ స్థితిగతులపై అవగాహన ఉన్నవారు.

రాజ్యాంగ పరిషత్ రెండవ సమావేశం 1947 జనవరి 20 నుండి 26 వరకూ జరిగింది. ఈ సమావేశంలో మొదటి సమావేశంలో ప్రవేశపెట్టబడిన లక్ష్యాల తీర్మానాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించింది. ఈ తీర్మానంలో భారతదేశాన్ని సర్వసత్తాక, ప్రజాస్వామ్య , గణతంత్ర రాజ్యంగా రూపొందించాలానే నిర్ణయం తీసుకున్నారు. రాజ్యాంగ పరిషత్ మూడవ సమావేశం 1947 ఏప్రిల్ 21 నుండి మే 2 వరకూ జరిగింది. ఈ సమావేశంలో ప్రాథమిక హక్కులకు సంబంధించిన నివేదికను చర్చించటం జరిగింది. ప్రాథమిక హక్కులను కుల, మత,వర్గ, లింగ భేదాలు లేకుండా భారత పౌరులందరికీ ప్రసాదించాలని ఈ నివేదిక సిఫార్సు చేసింది.1947 ఆగష్టు 14,15 అర్ధరాత్రి స్వాతంత్ర్యాన్ని భారతదేశం పొందుకుంటున్న సందర్భంలో రాజ్యాంగ పరిషత్ ప్రత్యేక సమావేశం జరిగింది.

రాజ్యాంగ పరిషత్ నాల్గవ సమావేశం 1947 ఆగస్ట్ 20 నుండి 29 వరకూ జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలోనే శాసన నిర్మాణ సభ హోదాలో, రాజ్యాంగ పరిషత్ సమావేశమైనప్పుడు ఎన్నుకోబడిన స్పీకర్ అధ్యక్షత వహించాలానే నిర్ణయం తీసుకోబడింది. రాజ్యాంగ పరిషత్, శాసన నిర్మాణ సభ హోదాలో 1947 నవంబర్ 17న సమావేశమైంది. ఈ సమావేశానికి జి.వి.మౌలాంకర్ స్పీకర్ గా ఎన్నుకోబడ్డారు. 1952 లో మొదటి సాధారణ ఎన్నికలు జరిగి నూతన పార్లమెంట్ ఏర్పడే వరకూ రాజ్యాంగ పరిషతే, శాసన నిర్మాణ సభగా కూడా పనిచేసింది.రాజ్యాంగ రచనా కమిటీ 1948 ఫిబ్రవరి 21న రాజ్యాంగ పరిషత్ కు ముసాయిదా(%ణశీఎబఎవత్%)ను సమర్పించింది.8 నెలల తర్వాత 1948 నవంబర్ 4న రాజ్యాంగ పరిషత్, రాజ్యాంగ ముసాయిదాపై చర్చ జరిపింది. 1949 లో మరొకసారి ముసాయిదా బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో రాజ్యాంగ పరిషత్ సభ్యులు అడిగిన వివిధ ప్రశ్నలకు రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షులైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, మిగిలిన సభ్యులు వివరణ ఇచ్చారు. 1949 నవంబర్ 26న రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ ముసాయిదాను ఆమోదించింది. ప్రజల ఆశలు, ఆశయాలు, దేశాభివద్ధికి అవసరమైన అంశాలతో, అనేక చట్టాతో రూపొందించబడిన భారత రాజ్యాంగం రచించుటకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. మన రాజ్యాంగం పూర్తిగా లిఖితపూరిత రాజ్యాంగం. దీనిని రచించుటకు 64 లక్షల రూపాయలు ఖర్చు అయింది.

మన రాజ్యాంగం పార్లమెంటరీ విధానం, ప్రాథమిక హక్కులు, లౌకిక రాజ్యం, వయోజన ఓటింగ్ హక్కు, ఏక పౌరసత్వం మొదలగు విశిష్ట లక్షణాలను కలిగి ఉంది. వీటిని మన రాజ్యాంగంలో పొందుపరచుటకు వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి, మన దేశానికి అనువైన రీతిలో మార్పు చేసి, మన రాజ్యాంగంలో పొందుపరిచారు. అంతేకాక అవసరమైన పరిస్థితుల్లో, కాలానుగుణంగా రాజ్యాంగాన్ని సవరించుటకు వీలుగా మూడు విధాలైన రాజ్యాంగ సవరణ పద్ధతులను సైతం మన రాజ్యాంగంలో పొందుపరిచారు.1950 జనవరి 24 న రాజ్యాంగ పరిషత్ చివరి సారిగా సమావేశమైంది. ఈ సమావేశంలో అప్పటివరకూ రాజ్యంగ పరిషత్ కు అధ్యక్షునిగా భాద్యతలు నిర్వహించిన డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ గారిని భారతదేశానికి ప్రథమ రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు.1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అప్పటి నుండి జనవరి 26ను మనం గణంతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము. భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చినప్పుడు, రాజ్యాంగంలో 395 అధికరణలు (ఆర్టికల్స్), 22 భాగాలు మరియు 8 షెడ్యూల్స్ ఉన్నాయి.అనేక సవరణల అనంతరము ప్రస్తుతం 444 అధికరణలు (ఆర్టికల్స్), 24 భాగాలు మరియు 12 షెడ్యూల్స్ మన రాజ్యాంగంలో ఉన్నాయి.

1949 నవంబర్ 26న భారత రాజ్యాంగానికి ఆమోదం లభించినందువలన నేటికీ మనం నవంబర్ 26 ను భారత రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవంగా జరుపుకుంటున్నాము. మన రాజ్యాంగం అనేక చట్టాలను కలిగి ఉన్నందు వలన, నవంబర్ 26ను జాతీయ న్యాయ దినోత్సవం గా కూడా జరుపుకుంటారు.

**- డూలి ప్రత్యూష,**
**ఎం.ఎ.పొలిటికల్ సైన్స్.**

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in